ప్రతి ఫిర్యాదుపై తక్షణ స్పందన

●పారదర్శక విచారణతో బాధితులకు న్యాయం చేయాలి



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ జరపాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులను ఆదేశించారు.ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిగణించాలని, ఎలాంటి జాప్యం, అలసత్వం లేకుండా విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

మ్యాజిక్ షో మాట్లాడే బొమ్మ తో విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఆర్జీ-1 ఏరియా ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని సింగరేణి కాలరీస్ హైస్కూల్, సెక్టార్-2లో ప్రత్యేక మ్యాజిక్ షో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జీ-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ సూచనల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఇంద్రజాల ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి.గోదావరిఖనికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు, వెంట్రిలాక్విస్ట్ మ్యాజిక్ రాజా, 8 ఇంక్లైన్ కాలనీకి చెందిన మెజీషియన్ శశి తమ అద్భుతమైన ఇంద్రజాల విద్యలు, మాట్లాడే బొమ్మల విన్యాసాలతో విద్యార్థులను ఆశ్చర్యపరిచారు. వినూత్నమైన ప్రదర్శనలతో చిన్నారులను నవ్విస్తూ, ఆనందోత్సాహాల్లో ముంచెత్తారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జీ-1 పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకత, వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల మానసిక వికాసానికి, సమగ్ర అభివృద్ధికి ఇలాంటి వినోదాత్మక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఆర్. విక్టోరియా, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

97 ఏళ్ల వయసులో కన్నుమూసిన వృద్ధురాలి నేత్రదానం

● పుట్టెడు దుఃఖంలోనూ గొప్ప మనసు చాటిన కుటుంబ సభ్యులు



జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

కన్నతల్లి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ.. ఆమె నేత్రాలను దానం చేసి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. గోదావరిఖనిలోని యైటింక్లయిన్ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఊరగొండ శంకర్ తల్లి ఊరగొండ అమ్మక్క (97) సోమవారం మృతి చెందారు. ఆమె మరణానంతరం కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించి మానవత్వాన్ని చాటుకున్నారు. సదాశయ ఫౌండేషన్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వెల్ది కవిత అనంతరాములు ఆధ్వర్యంలో, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ టెక్నీషియన్ ప్రదీప్ సహకారంతో మృతురాలి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. అమ్మక్క నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించిన కొడుకులు రాయమల్లు, శంకర్, కోడళ్లు సత్తమ్మ, రాజేశ్వరి, ఉమ, కూతుళ్లు మల్లక్క, రాజేశ్వరి, అల్లుళ్లు నారాయణ, మల్లేష్‌లను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ గౌరవ సలహాదారు మారెల్లి రాజిరెడ్డి, 16వ డివిజన్ కార్పొరేటర్ మందల కిషన్‌రెడ్డి, బంధుమిత్రులు పాల్గొన్నారు. నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాను, గౌరవ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, సలహాదారులు నూక రమేష్, రాజమహేందర్‌రెడ్డి తదితరులు అభినందించారు.తమ ఇంట విషాదం నెలకొన్నా.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాలన్న కుటుంబ సభ్యుల నిర్ణయం ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. అమ్మక్క నేత్రదానం సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సర్పంచ్ చొరవ కార్మికులకు భరోసా

●ఎంపీడబ్ల్యూ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ కోసం మంత్రి సీతక్కకు కిషోర్ నాయక్ వినతి

●జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని విజ్ఞప్తి

● సీఎం దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో చర్చకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /నవంబర్ 16 /అక్షరం న్యూస్:

గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్ (వీఓఏ) కార్మికుల సంక్షేమం కోసం సారపాక సర్పంచ్ కిషోర్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సారపాక మేజర్ గ్రామపంచాయతీతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కిషోర్ నాయక్ మాట్లాడుతూ.. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ముఖద్వారంగా ఉన్న సారపాక ప్రముఖ పారిశ్రామిక ప్రాంతంగా విస్తరించిందని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో పారిశ్రామిక సంస్థలు, నివాస కాలనీలు అధికంగా ఉండటంతో పాటు ప్రజల రాకపోకలు నిరంతరం కొనసాగుతుంటాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఇతర గ్రామపంచాయతీ విధుల్లో మల్టీపర్పస్ వర్కర్స్ నిరంతరం సేవలందిస్తున్నారని వివరించారు.

అయితే జిల్లాలోని పలు గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అందకపోవడంతో భవిష్యత్తు ఆర్థిక భద్రత, అత్యవసర వైద్య అవసరాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తగిన పరిష్కారం లంభించలేదని వివరించారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న అర్హులైన కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థిక భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కిషోర్ నాయక్ వినతిపై రాష్ట్ర మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై ప్రత్యేకంగా చర్చకు వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమన్న కూడా పాల్గొన్నారు.

విధులలో చేరిన ఇంచార్జ్ విద్యుత్ ఏ.ఈ సంతోష్ రెడ్డి

● శాలువతో సత్కరించిన విద్యుత్ సిబ్బంది



రామగిరి (పెద్దపల్లి జిల్లా) నవంబర్ 16 అక్షరం న్యూస్:

రామగిరి మండలం విద్యుత్ ఏ.ఈ గా కే.సంతోష్ రెడ్డి సోమవారం రోజున విధులలో చేరారు. రత్నాపూర్ సబ్ స్టేషన్ లోని విద్యుత్ కార్యాలయంలో మంథని విద్యుత్ డి.ఈ వి.ప్రభాకర్ సమక్షంలో ఆయన విధులలో చేరారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా విధులు నిర్వహించాలని డి.ఈ సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది డి.ఈ ని, ఇన్చార్జి ఏ.ఈ ని సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం ఏ.ఈ రాజేందర్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ మౌలానా, లైన్ ఇన్స్పెక్టర్ ఉడుత భూమయ్య, నవీన్, లైన్ మెన్ బండారు శివకుమార్, రాజేందర్, ఆకుల శ్రీనివాస్, రమేష్, ఏ.ఎల్ . ఎం లు ఈశ్వర్, రాజు, కృష్ణమాచారి, బండి శ్రీనివాస్, రాకేష్, కాంట్రాక్టర్ గుండ రాదయ్య, చందన్ కుమార్ లు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ ఏర్పాటు చేయండి :

రత్నపూర్ సబ్ స్టేషన్ లో సెల్ఫోన్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు కోరారు. సబ్ స్టేషన్ కు వచ్చిన డి.ఈ వేగ్గలం ప్రభాకర్ కి వినతి అంధించారు.. ఫోన్ లేక వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీంతో త్వరలో సెల్ ఫోన్ ఏర్పాటు చేస్తానని డిఈ హామీ ఇచ్చారు.

రాష్ట్ర పురిగిరి క్షత్రియ నాయకులకు ఘన సన్మానం



రామగిరి(పెద్దపెల్లి జిల్లా) నవంబర్ 16 అక్షరం న్యూస్:

మంథనిలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు విచ్చేసిన పురిగిరి క్షత్రియ (పెరిక) సంఘం రాష్ట్ర అధ్యక్షులు గటిక విజయ్ కుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పోశం , రాష్ట్ర నాయకులు మందా లింగయ్య, సుంకరి ఆనంద్, దాసరి మల్లేశం తదితరులకు సోమవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని పురిగిరి క్షత్రియ (పెరిక) సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మండల పెరిక సంఘం అభివృద్ధికి రాష్ట్ర నాయకులు సహాయ సహకారాలు అందించాలని, మండలంలో సంఘం సొంత కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని మండల నాయకులు కోరారు.దీనిపై రాష్ట్ర నాయకులు స్పందిస్తూ రామగిరి మండల పురిగిరి క్షత్రియ సంఘం అభివృద్ధికి తమ పూర్తి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. తమను ఘనంగా సన్మానించిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు దుండి మల్లేశ్, గోవిందుల ఆనంద్, జిల్లా నాయకులు బత్తుల రమేష్, సెంటినరీ కాలనీ సంఘం అధ్యక్షులు బుగ్గే కుమార్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, కోశాధికారి కందుల సదయ్య, బుద్దే ఉదయ్, దుండే రవీందర్, చింతం కిరణ్ కుమార్, సందెల కుమార్, బుద్ధి శంకరయ్య, అంకతి నాగన్న, ఉగ్గే కొమురయ్య, కొట్టే భీమన్న, ఉగ్గే నవీన్, ప్రవీణ్,పి రమేష్,సందెల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ముఖ్యనాథస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు

●ఘనంగా శ్రీ ముఖ్యనాథేశ్వరుల కల్యాణ మహోత్సవం



హనుమకొండ, ధర్మసాగర్,నవంబర్ 16, అక్షరం న్యూస్:

ముప్పారం గ్రామంలోని పురాతన శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయంలో తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఆలయ పునఃవ్యవస్థాపకులు శివసాని ప్రవీణ్ రవీంద్ర ఆధ్వర్యంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేకువజామునే ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయంలో రుద్రాభిషేకం, హోమాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ ముఖ్యనాథేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టడంతో పాటు ఉత్సవ విగ్రహాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మా, అమరేందర్ రెడ్డి, పురావస్తు శాఖ ఏడీ దేవనగరి బుజ్జి, ఎంపీడీవో సదానందం, పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, గౌరవ సలహాదారులు గొట్టిముక్కుల సురేష్ కుమార్, దారపు చంద్రయ్య, వార్డు సభ్యులు ఎతిరాజుల శోభా మల్లయ్య, వెల్దండి శ్వేత, మాజీ సర్పంచ్ చామల వాసుదేవరెడ్డి, గొనేల సమక్క రాజయ్య, గైకమల, మాజీ ఎంపీటీసీ పెద్ది శ్రీను, రాములు, రవీందర్ రెడ్డి, మారబోయిన యాదగిరి, ఎర్ర చేరాలు, వజ్ర రాజబాబు, మోడెమ్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ

•పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఖమ్మం/ స్టాప్ రిపోర్టర్ నవంబర్ 16 (అక్షరం న్యూస్)

ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ విభాగాన్ని పరిశీలించి, ఫిర్యాదుల స్వీకరణ, నమోదు, పరిష్కారానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను శ్రద్ధగా విని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని సూచించారు.అనంతరం పోలీసుల పనితీరును సమీక్షిస్తూ, ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా సెక్టార్ అధికారుల బాధ్యతలను వివరిస్తూ, తమ పరిధిలోని ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల గుర్తింపు, సమస్యాత్మక ప్రాంతాల పర్యవేక్షణతో పాటు ప్రజలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.కార్యక్రమంలో ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.


ఏఎస్సై గా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 16 (అక్షరం న్యూస్)

వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులు డి.కొండయ్య, టి. వెంకటేశర్లు, వి.నరసింహారావు ఎన్. హరిప్రసాద్, వి.జయరాజు లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారు భద్రాద్రి కొత్తగూడెం,వరంగల్ జిల్లా కు బదిలీపై వెళ్ళనున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు హేమనాద్ పాల్గొన్నారు.

లక్ష గాజులతో అమ్మవారు అలంకరణ



ఖమ్మం/తల్లాడ నవంబర్ 16 (అక్షరం న్యూస్)

తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామంలో వైరా రోడ్డులో పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారిని అలంకరించారు. కార్తీక మాసం సందర్భంగా సోమవారం అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు వెదురు కృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసాన్ని పురస్కరించుకొని దేవాలయంలో అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించడం జరిగిందని, ఈ ప్రాంత భక్తులు వచ్చి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి చొరవతో పల్లెల అభివృద్ధికి రూ.4.36 కోట్లు

• వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ (వీబీ--జీ రామ్ జీ) పథకం కింద నిధుల మంజూరుఎ.

• 37 అభివృద్ధి పనులకు కేటాయింపు..



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 16 (అక్షరం న్యూస్)

ఖమ్మం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మరో ముందడుగు పడింది. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ (వీబీ--జీ రామ్ జీ) పథకం కింద రూ. 4.36 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి చొరవతో తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 37 అభివృద్ధి పనులకు ఈ నిధులు కేటాయించారు.

ఇవీ చేపట్టనున్న పనులు

మంజూరైన నిధుల్లో రూ. 2.60 కోట్లతో 13 గ్రామ పంచాయతీ భవనాలు, రూ. 36 లక్షలతో మూడు అంగన్ వాడీ భవనాలు నిర్మించనున్నారు. మరో రూ. 1.40 కోట్లతో గ్రామ పంచాయతీలు, పాఠశాలలకు సంబంధించి 21 ప్రహరీల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే గ్రామాల్లో పాలనాపరమైన వసతులు మెరుగుపడటంతో పాటు అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరనున్నాయి.

ఎంపీకి సర్పంచుల కృతజ్ఞతలు

రూ. 4.36 కోట్ల నిధులు మంజూరు చేయించడం పట్ల గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డిని కలిసి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 16(అక్షరం న్యూస్) ఖమ్మం: పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మంగళవారం పర్యటించనున్నారు. తొలుత ఉదయం 11 గంటల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రభుత్వ, పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు. ఆ తర్వాత.. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఖమ్మం జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ మేరకు ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం రాత్రి ఓ ప్రకటన వెలువడింది.

నవంబర్ 19న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఖమ్మం జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

• జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

•అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లు పూర్తి చేయాలి..

•కేంద్ర మంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 16 (అక్షరం న్యూస్)

కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 19న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి కేంద్రమంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఖమ్మం జిల్లా జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ నెల 19న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నందున, కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించి ఈవెంట్ మేనేజర్ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మినిట్ టు మినిట్ ప్రోగ్రాం రూపొందించి, కార్యక్రమాల షెడ్యూల్‌ను ముందుగానే ఖరారు చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యటనలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి సంబంధించి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని, ఆయా శాఖలకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హెలిప్యాడ్, రహదారుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి:

కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాట్లను అవసరమైన ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్ అండ్ బి శాఖ అధికారులు పర్యటన మార్గాల్లో రహదారులకు ఇరువైపులా అవసరమైన మరమ్మతులు, ఇతర మౌళిక సదుపాయాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.నేభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీటింగ్, పార్కింగ్, భద్రత, ఇతర సౌకర్యాలను సమగ్రంగా ఏర్పాటు చేయాలని తెలిపారు.కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించి అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, వారికి కేటాయించిన పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు డీసీపీ రామానుజం, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి. రామారావు, సంబంధిత శాఖల అధికారులు, జాతీయ రహదారుల శాఖ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి పెద్దపీట

• రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

• సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి





ఖమ్మం/సత్తుపల్లి, నవంబర్ 16(అక్షరం న్యూస్)సమగ్ర అభివృద్ధి, ప్రజల, రైతుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి సోమవారం సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో రూ. 10.80 కోట్ల అంచనాతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం చల్లగుల్ల నరసింహారావు చైర్మన్ గా సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,?గత 45 సంవత్సరాలుగా ప్రజల కష్టసుఖాల్లో, మంచీచెడుల్లో నిత్యం వెన్నంటి నిలబడి ప్రజలకోసం పనిచేశానని అన్నారు. ఏ రాజకీయ మార్పు వచ్చినా, ఏ పార్టీలో ఉన్నా ప్రజలు, నాయకులు తనను ఎప్పుడూ ఆదరించి ముందుకు నడిపించారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీ రామారావు హయాంలో, అన్ని వర్గాలు, ఆరు మండలాలు కలిగిన ఉన్న సత్తుపల్లి నియోజకవర్గంలో తనకు అవకాశం దక్కడం అదృష్టమని తెలిపారు.ఉమ్మడి రాష్ట్రంలో మొదలైన దేవాదుల, దుమ్ముగూడెం ప్రాజెక్టులు ఆగిపోయినా, తిరిగి సీతారామ ప్రాజెక్టు నియోజకవర్గానికి నీళ్లు తెచ్చామని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని చెరువు ద్వారా ఇప్పటికే భూములకు నీరు అందించామని, రాబోయే సంక్రాంతి పండగ నాటికి వేశ్యాకాంతల చెరువుకు కూడా గోదావరి జలాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలో ఎన్జీటీ సమస్యలు పూర్తి చేసుకుని, మే నెలకల్లా మరిన్ని ప్రాంతాలకు గోదావరి జలాలు అందించేలా సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తామని అన్నారు. ?కల్లూరుగూడెం ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణంతో, ఈ ప్రాంతంలో 3 వేల ఎకరాలలో పామాయిల్ ప్లాంటేషన్ జరిగిందని, మరో 3 వేల ఎకరాలకు కూడా రైతులు ముందుకు వస్తున్నారని తెలిపారు. పామాయిల్ రైతులు నష్టపోకుండా శాశ్వత ప్రయోజనం చేకూరుస్తామని చెప్పారు. పామాయిల్ తో పాటు కోకో, మిరియాలు వంటి ఉద్యానవన పంటలను సాగు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు .?ఒక విమానాశ్రయం, భద్రాద్రి రాముడికి రైల్వే లైన్, అలాగే సత్తుపల్లి మీదుగా కోవూరు, కొండపల్లికి రోడ్లు రవాణా సౌకర్యాలు మెరుగుపరచడమే తన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఖమ్మం మార్కెట్ మాదిరిగా సత్తుపల్లి మార్కెట్ ని కూడా మోడల్ మార్కెట్ గా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరినీ సముచిత రీతిలో గౌరవించుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, అందులో భాగంగానే సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చెల్లగుల్ల నరసింహారావుకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని అన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో నూతన పాలకవర్గం మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసి రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతే రాజు అనే నినాదంతో ఆరు గ్యారెంటీలతో పాటు హామీ ఇవ్వని ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఉచిత బస్సు, గృహజ్యోతి ఉచిత కరెంటు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, వరి ధాన్యానికి బోనస్ వంటి చారిత్రాత్మక పథకాలు దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే అమలవుతున్నాయని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేశామన్నారు.నవంబర్ 19 నుంచి కొత్త పెన్షన్ల పంపిణీ ప్రారంభమవుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి, సత్తుపల్లి నియోజకవర్గంలో 4,700 మందికి ఒంటరి మహిళ, వితంతు, వికలాంగ, కల్లుగీత, చేనేత కార్మిక పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొదటి విడతలో 3,500 ఇళ్లు ఇచ్చామని, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేస్తున్నామని, మూడు, నాలుగు విడతల్లో అర్హులందరికీ ఇళ్లు అందుతాయని ఎమ్మెల్యే అన్నారు.

ప్రభుత్వం ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొడుతూ, మనం చేసిన అభివృద్ధిని గర్వంగా చెప్పుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ, మండల, పట్టణ స్థాయి కమిటీలతో పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉందని, ఐకమత్యంతో పనిచేస్తే రాబోయే ఎన్నికల్లోనూ విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు.రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు రెఫరెండం లాంటివని, గతంలో తీన్మార్ మల్లన్నను గెలిపించిన తరహాలోనే ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నారు. తద్వారా నిరుద్యోగులు, ఉద్యోగస్తుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్, ఉప సంచాలకులు వి. పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఆర్. సంతోష్ కుమార్, సత్తుపల్లి మునిసిపల్ చైర్ పర్సన్ రెహానా బేగం, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609